క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రౌతులపూడిలో రక్తదానం చేస్తున్న యువకులు

రౌతులపూడి: హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రౌతులపూడిలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలోని సత్యదేవ కాలనీ వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 60 మంది రక్తదానం చేశారు. మదర్ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు రక్తం సేకరించారు. రక్తదానం చేసిన వారిని హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు అభినందించారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.

5న చెట్ల ఫలసాయానికి బహిరంగ వేలం

తుని: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్, బస్టాండ్ ఆవరణలో ఉన్న 62 మామిడి, 4 సపోటా చెట్ల ఫలసాయం పొందేందుకు మార్చి 5న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. తన కార్యాలయంలో 5వ తేదీ సాయంత్రం 3 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 73829 13016, 73306 51904, 99592 25539 నంబర్లకు ఫోన్ చేసి తమ పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోవాలి



తేటగుంటలో చేతిపంపులను ప్రారంభిస్తున్న సోనీవుడ్, మహంతి

తుని రూరల్: స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాసా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, ఏపీపీఎస్సీ సభ్యుడు ఎన్.సోనీవుడ్ సూచించారు. మండలంలోని తేటగుంట, తాళ్లూరు గ్రామాల్లో విశాఖపట్నానికి చెందిన సీఎల్‌సీ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన చేతి పంపులను మంగళవారం ఆయన ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. సీఎల్‌సీ సంస్థ డైరెక్టర్ ఆల్ఫ్రెడ్ మహంతి, నాసా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు

కోటనందూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రైవేటు పాఠశాలల్లోనూ 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయిస్తారని ఎంఈఓ శ్రీనివాసు తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశానికి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైందన్నారు. అర్హులైన విద్యార్థులు మార్చి 5 నుంచి 25 వరకూ సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయించుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1న లాటరీ విధానంలో అర్హుల తొలి జాబితా విడుదల చేస్తారన్నారు. అర్హులైన పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సూచించారు.

ఎలక్ట్రిక్ మోటారు బైక్ దగ్ధం



రౌతులపూడిలో కాలి బూడిదైన ఎలక్ట్రిక్ మోటార్ బైక్

రౌతులపూడి: గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన ఎలక్ట్రిక్ మోటారు వాహనం దగ్ధమైంది. గ్రామంలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు మోహన్ ఇంటి ఆవరణలో సోమవారం రాత్రి ఎలక్ట్రిక్ వాహనం పార్కింగ్ చేశాడు. రాత్రి పది గంటల సమయంలో మోటారు వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. బైక్ యజమాని మోహన్ ఇంట్లో నుంచి బయటకు వచ్చే సరికి పూర్తిగా కాలిబూడిదైంది. కాగా ప్రమాదానికి గల కారణం తెలియ రాలేదు.

ఏలూరుకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

ఏలేశ్వరం: ఏలూరులో నిర్వహించే బీజేపీ బహిరంగ సభకు మంగళవారం నియోజవర్గవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు యర్రవరం మీదుగా ప్రత్యేక వాహనాల్లో ఏలూరు వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరులో నిర్వహించే సభలో కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొని బూత్‌స్థాయి కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు చెప్పారు. పార్టీ నాయకులు కందా వీరాస్వామి, కర్రి ధర్మరాజు, గట్టిం వెంకటరమణ, కురాకుల రాజా, రెడ్డి లోవరాజు పాల్గొన్నారు.

స్వపరిపాలనలో వలంటీర్ల పాత్ర కీలకం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- ఎస్.అన్నవరంలో వలంటీర్లకు సత్కారం



ఎస్.అన్నవరంలో వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: స్థానిక స్వపరిపాలనలో వలంటీర్ల పాత్ర కీలకమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరం శివారు సాయివేదికలో మంగళవారం నియోజకవర్గస్థాయి వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా పాల్గొని సేవామిత్ర, సేవరత్న, సేవావజ్ర అవార్డులను వలంటీర్లకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ వలంటీర్ల సేవలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. గుర్తింపు, గౌరవించడంలో భాగంగానే ప్రతి సంవత్సరం వలంటీర్లను సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులతో సత్కరిస్తున్నట్టు తెలిపారు. అవార్డులు పొందిన వలంటీర్లు మరింత సేవాభావంతో పని చేయాలన్నారు. స్థానికంగానే కాకుండా దూరప్రాంతాలకు సైతం వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించడంతో ప్రజల హృదయాలను వలంటీర్లు గెలుచుకుంటున్నారన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా వలంటీర్లు పని చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఎంతో పటిష్టంగా పని చేస్తోందంటే అందులో వలంటీర్లకు భాగస్వామ్యం ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లడంలో వలంటీర్లు ముందడుగు వేయాలని సూచించారు. రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవాని, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు, ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

ఏలేశ్వరం: పట్టణంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మార్కెట్ వీధిలోని 6వ సచివాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందు, దోశ కిషోర్, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులు పొందిన వలంటీర్లకు శాలువా, పూలమాలలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. పథకాల అమలులో అవినీతికి తావులేకుండా సీఎం జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. వలంటీర్ల సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సిరిపురపు రాజేష్, జువ్విన వీర్రాజు, బంటుపల్లి శ్రవణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వలంటీర్లను సత్కరిస్తున్న కౌన్సిలర్లు

పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు



యల్లమిల్లి పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ రమేష్

గండేపల్లి: మండలంలోని యల్లమిల్లిలో ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు మెమోలు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఎంఈఓలను ఆదేశించారు. గండేపల్లి, సూరంపాలెం జెడ్పీ హైస్కూళ్లు, యల్లమిల్లి ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యల్లమిల్లిలో విద్యార్థులు స్కూల్ బ్యాగ్స్, షూస్ లేకుండా స్కూల్‌కు రావడం, పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత నెలకొనడంపై అసహనం వ్యక్తం చేశారు. 3 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నేర్పవలసిన టోఫెల్‌పై వెనుకబాటుతనాన్ని గుర్తించి ఉపాధ్యాయుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫాం, స్కూల్ బ్యాగ్స్, షూస్‌లతో పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓలు వెంకటరెడ్డి, నాయక్, తదితరులు ఉన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు



గజ్జనపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు
- గజ్జనపూడి, శరభవరం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రత్తిపాడు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకూ మేలు చేకూరుతోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని గజ్జనపూడి, శరభవరం గ్రామాల్లో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, మండల మాజీ కన్వీనర్ బెహరా దొరబాబు, సర్పంచులు గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీలు మొల్లి వీరబాబు, అమరాది కాశీ, అల్లు సత్తిబాబు, బర్ల నాగరాజు, రంగనాథం అబ్బాయి, బర్రే రామకృష్ణ, రామిశెట్టి దొరబాబు, బోడపాటి నాగేశ్వరరావు, కర్రి మురళి, రేఖా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు

- జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు



తేటగుంటలో మామిడి పూత, పిందెలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు

తుని రూరల్: వాతావరణ మార్పుల కారణంగా ఆశించే తెగుళ్లు, పురుగులను సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు పాటిస్తే మామిడిలో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యానశాఖ కాకినాడ జిల్లా అధికారి నేతల మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని తేటగుంటలో మంగళవారం హార్టికల్చర్ ఆఫీసర్ జి.విజయలక్ష్మితో కలసి పర్యటించారు. పూత, పిందె దశల్లో తెగుళ్లు, పురుగులు సోకి పంటకు నష్టం కలిగిస్తాయన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మామిడికి తామర పురుగు, ఆకుగూడు పురుగు, తేనె మంచు పురుగు, కాండం తొలుచు పురుగు, పండు ఈగ, పక్షికన్ను తెగులు సోకే ప్రమాదం ఉందన్నారు. తెగుళ్ల లక్షణాలను గుర్తించి ఉద్యాన అధికారుల సూచన మేరకే రైతులు మందులు పిచికారీ చేయాలన్నారు. మోతాదుకు మించి మందులు పిచికారీ చేస్తే పెట్టుబడి పెరగడంతో పాటు దిగుబడి తగ్గుతుందని హెచ్చరించారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత



కృష్ణాపురంలో దివ్యాంగుడు రాజుకు వీల్ చైర్ అందజేసిన తుని రోటరీ క్లబ్ సభ్యులు

తొండంగి: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడికి మంగళవారం తుని రోటరీ క్లబ్ సభ్యులు వీల్ చైర్, నిత్యావసర వస్తువులు అందజేశారు. గ్రామానికి చెందిన కొట్టుమూరి డేవిడ్ రాజుకు కాళ్లు సరిగ్గా పనిచేయకపోవడంతో నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. నెల రోజుల క్రితం రాజు తండ్రి మృతి చెందాడు. దీంతో అతని భారం తల్లిపై పడటంతో ఇబ్బందుల్లో ఉన్న రాజుకు తుని రోటరీ క్లబ్ కార్యదర్శి కర్రి కిషోర్‌రెడ్డి వీల్‌చైర్‌ను, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు సీహెచ్ మంగరాజు, డాక్టర్ పి.ప్రసాద్, డాక్టర్ టి.నాగిరెడ్డి, ఎస్.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



సింహాద్రిపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న తోట వాణి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి వాణి
- సింహాద్రిపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

కిర్లంపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి తోట వాణి అన్నారు. మండలంలోని సింహాద్రిపురంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ ఆధ్వర్యంలో తోట వాణి, తోట రాంజీ సతీమణి శ్రీనిధి, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా తోట వాణి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. వెళ్లిన ప్రతిగడపలోనూ లబ్ధిదారులు ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాలపరెడ్డి పాయమ్మ, ఎంపీటీసీ నంది భాగ్యలక్ష్మి, పార్టీ నాయకులు కాలపురెడ్డి కాశీవిశ్వనాథం, నంది సత్తిబాబు, కాలపరెడ్డి శ్రీనివాస్, తోట వేణు, దోమాల గంగాధర్, ఓలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



శంఖవరంలో ఎంపీడీఓ ఎం.విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

శంఖవరం: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా దివ్యాంగుల జేఏసీ అధ్యక్షుడు గుణపర్తి కొండలరావు కోరారు. ఈ మేరకు మంగవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.విజయ్‌కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో దివ్యాంగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు కొండలరావు మాట్లాడుతూ ప్రస్తుతం దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న రూ.3000 పింఛన్‌ను రూ.6000 చేయాలన్నారు. దివ్యాంగులకు 35 కేజీల రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. ప్రతి దివ్యాంగుడికి డబల్‌బెడ్ రూము ఇళ్లు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

తుని: తొండంగి మండలం పెరుమాళ్లపురం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన మేమపు సూర్యనారాయణ, శ్రీను, తాతాజీ కుటుంబ సభ్యులతో పాటు వారి అనుచరగణం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా వీరికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో మంత్రి దాడిశెట్టి రాజా చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్టు పార్టీలో చేరిన వారు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



అల్లిపూడిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ మూర్తి

కోటనందూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తుని రూరల్ ఎస్సై ఎవ్వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. మండలంలోని కాకరాపల్లి, అల్లిపూడి, కోటనందూరు, ఎల్లీపేట, కొత్తకొట్టాం, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాల్లో పోలింగు బూత్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మూర్తి మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టమన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్సై శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలంటూ ధర్నా



ఏలేశ్వరం జనగన్న కాలనీలో ధర్నా చేస్తున్న ప్రజలు

ఏలేశ్వరం: ఏలేరు కాలువలో ఇసుక అక్రమ రవాణా (తరలింపు)ను అడ్డుకోవాలని కోరుతూ పట్టణంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. జై భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ కన్వీనర్ దాడిశెట్టి వీరబాబు ఆధ్వర్యంలో స్థానిక జగనన్న కాలనీ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ పట్టణంలోని కప్పలచెరువు సమీపంలోని జగనన్నకాలనీకి ఆనుకుని ఉన్న ఏలేరు కాలువలో కొందరు ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రి సమయంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్నారు. జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో ఇసుకను అక్రమంగా తరలించి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఏలేరు కాలువలో ఇసుక తరలింపుపై నిషేధం ఉందన్నారు. కాలువలో ఇసుక తరలిస్తే దిగువ ప్రాంత ఆయకట్టుకు నీరు అందదని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు డి.రమేష్, శిడగం వీర్రాజు, ఎం.అర్జునరావు, కె.నాగమణి, లక్ష్మి, తాయారు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: ఆటోలో అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. వివరాల్లోకి వెళితే... శంఖవరం మండలం గౌరంపేటలో సెబ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఆదే గ్రామానికి చెందిన గనిశెట్టి అప్పారావు ఆటోలో 60 లీటర్ల సారాను తరలిస్తుండగా అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఆటోతో పాటు ఆటోలో ఉన్న 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. గనిశెట్టి అప్పారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. వివిధ కేసుల్లో పరారీలో ఉన్న ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాలకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ దాడిలో సెబ్ ఎస్సై ఎం. ఆశాలత, హెచ్‌సీలు వెంకన్నదొర, కృష్ణార్జున తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కదిలే స్పీడ్ బ్రేకర్లు



ఏలేశ్వరం రూపులమ్మగుడి జంక్షన్ వద్ద రహదారిపై తిష్టవేసిన మూగజీవాలు

ఏలేశ్వరం: పట్టణంలో మూగజీవాలు రహదారులపై తిష్ట వేసి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారులైన బాలాజీ చౌక్, హనుమాన్ జంక్షన్ల వద్ద రహదారులపై గంటల తరబడి తిష్ట వేస్తున్నాయి. దీంతో వాహనాలు, పాదాచారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అలాగే మార్కెట్ రోడ్డు, రూపులమ్మగుడి జంక్షన్ వద్ద పశువులు గుంపులుగా రోడ్లపై తిరుగుతున్నాయి. పగలు, రాత్రి లేడా లేకుండా నిత్యం రోడ్లపైనే ఉండడంతో వాటిని గమనించని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి యజమానులు రోజూ రెండుపూటలా పాలు తీసుకొని వాటిని వదిలి వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. యజమానులు వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో రోడ్లపైనే కాలక్షేపం చేస్తున్నాయి. వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యండపల్లిలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం పర్యటన



యండపల్లిలో ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కొత్తపల్లి: మండలంలోని యండపల్లిలో మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం పర్యటించింది. రీ ప్రోడక్ట్ చైల్డ్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీస్తున్నట్టు నోడల్ అధికారి వి.అరుణ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పరంగా వైద్య సిబ్బంది ఎటువంటి సేవలు అందిస్తున్నారు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా ? లేదా ? పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నారా ? ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందుతున్నాయా ? అనే అంశాలపై గ్రామస్తులను ఆరా తీశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఆపరేషన్ థియేటర్, మందుల నిల్వలను పరిశీలించారు. ఓపీ నమోదుపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని నోడల్ అధికారి అరుణ తెలిపారు. కార్యక్రమంలో స్టాటిస్టికల్ అధికారి బి.విజయలక్ష్మి, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి మహేశ్వరరావు, డేటా మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.